05122024-MAI-06_Layout 1 12/5/2024 3:27 AM Page 1

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

దక్షిణ కొరియాలో సంక్షోభం

అవినీతి ఆరోపణలు చుట్టుముట్టినప్పుడు, విపక్షాలు నిలదీసినప్పుడు నిరంకుశ పాలకులకు రెండు ఎత్తుగడలు గుర్తుకువస్తాయి. ఒకటి, తమను వేలెత్తి చూపేవారిపై దేశ వ్యతిరేక శక్తులుగా ముద్రవేయడం. రెండు, ప్రజాస్వామ్యాన్ని పక్కనపెట్టి అత్యవసర పరిస్థితి విధించడం. దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ ఆ పనే చేశారు. తనపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణకు డిమాండ్ చేస్తున్న విపక్షాలను జాతి ద్రోహులుగా దూషించారు. ఉత్తరకొరియా బూచిని భూతద్దంలో చూపారు. విపక్షాలు శత్రుదేశ ఏజెంట్లుగా మారారని బట్టకాల్చి మీద వేశారు. చేజారిపోతున్నట్టు కనిపిస్తున్న తన అధికారాన్ని పదిలం చేసుకునేందుకు చివరి అస్త్రంగా సైనిక పాలన (మార్షల్ లా)ను ప్రయోగించారు. ఈ హఠాత్ పరిణామం దక్షిణ కొరియా ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. 50 ఏండ్లుగా మరచిపోయిన సైనిక పాలన పీడకల మరోసారి తమను కమ్మేసే సరికి వారు అప్రమత్తమయ్యారు. విపక్షాలు సకాలంలో స్పందించి ప్రజల మద్దతు కూడగట్టి గట్టిగా ప్రతిఘటించడంతో కొన్ని గంటల్లోనే పరిస్థితి తారుమారైంది.

సైనిక పాలనకు వ్యతిరేకంగా పార్లమెంటు తీర్మానం చేయడంతో యూన్ తన ఫర్మానాను వెనక్కి తీసుకున్నారు. అధ్యక్ష పదవిలో కొనసాగే నైతిక అర్హతను యూన్ కోల్పోయారని, దుస్సాహసానికి పాల్పడినందుకు గానూ అభిశంసన తప్పదని విపక్షాలు పట్టుబడుతున్నాయి. రాజ్యాంగ న్యాయస్థానం అభిశంసనకు అనుకూలంగా తీర్మానిస్తే యూన్ అధ్యక్ష పదవిని కోల్పోవడమే కాకుండా విచారణను ఎదుర్కోవాల్సి వస్తుంది. 1979లో సైనిక నియంత పార్క్ చుంగ్ హీ హత్య జరిగిన సమయంలో చివరిసారిగా దక్షిణ కొరియాలో మార్షల్ లా విధించారు. సుదీర్ఘకాలం సైనిక నియంతృత్వం కింద కొనసాగిన దక్షిణ కొరియా 1987 నుంచి పార్లమెంటరీ ప్రజాస్వామ్యంగా మారిపోయింది. ఆ తర్వాత మార్షల్ లా విధించాల్సిన అవసరం రాలేదు. తీవ్ర జాతీయవాది అయిన యూన్ 2022 మే నెలలో అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు విపక్ష లిబరల్ డెమొక్రాట్లను అధిక సంఖ్యలో గెలిపించి ఆయన అధికారానికి ముకుతాడు వేశారు. దీంతో తీవ్ర జాతీయవాదానికి, ఉదారవాదానికి మధ్య ఆధిపత్య పోరు మొదలైంది.

పార్లమెంటు నిర్ణయాలను యూన్ వీటో చేస్తుండటం, అధ్యక్షుని నిరంకుశ ఫర్మానాలను తిరస్కరిస్తూ పార్లమెంటు తీర్మానాలు చేస్తుండటంతో దక్షిణ కొరియాలో ఘర్షణ వాతావరణం నెలకొన్నది. అవినీతి ఆరోపణలు, వివాదాలు ఈ ఘర్షణకు ఆజ్యం పోశాయి. అధ్యక్షుని సతీమణి విదేశీయుల నుంచి విలువైన కానుకలను అందుకోవడంపైనా విమర్శలు వచ్చాయి. దీనిపై విచారణకు యూన్ మోకాలడ్డు పెట్టడంతో రెండు ప్రభుత్వ వ్యవస్థల మధ్య వైరం తారస్థాయికి చేరుకున్నది. ఈ నేపథ్యంలోనే తనను చుట్టుముట్టిన సమస్యల నుంచి బయట పడేందుకు సులభ మార్గంగా సైనిక పాలనను ఎంచుకుని యూన్ భంగపడ్డారు. మొత్తం మీద సైనిక పాలన ముప్పు తొలగిపోయినందుకు దక్షిణకొరియా ప్రజలు హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నారు. నిరంతర అప్రమత్తతే ప్రజాస్వామ్యానికి రక్ష అనే విజ్ఞుల మాట ఈ సందర్భంగా గుర్తుకు రాక మానదు.

ఏడాది పాలనంతా ఎటమటమే

యం.డి.జమీలుద్దీన్
86862 11556

58 ఏండ్ల సమైక్య పాలనలో తెలంగాణ తీవ్ర వివక్షకు గురైంది. ప్రజల జీవనాధారమైన వ్యవసాయం కునారిల్లింది. ఎవుసానికి అవసరమైన సాగునీరు, కరెంటు లేక, చెరువులు మరమ్మతులకు నోచుకోక రైతులు ఉరితాళ్లకు వేలాడారు. మొత్తంగా వలసలు, ఆత్మహత్యలతో విధ్వంసమైన తెలంగాణ తన అస్తిత్వాన్ని, ఉనికిని కోల్పోయింది.

పదమూడేండ్ల నిరంతర పోరాటం, వందలాది అమరుల ఆత్మ బలిదానం వల్ల సాకారమైన తెలంగాణ ప్రజలు దూరదృష్టితో ఆలోచించారు. అందుకే, ఉద్యమ నాయకుడికే ముఖ్యమంత్రిగా అవకాశం ఇచ్చారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్న కేసీఆర్ విధ్వంసానికి గురైన తెలంగాణకు కాపుగాశారు. ఒక్కో రంగాన్ని వృద్ధి చేస్తూ, స్వయం సమృద్ధి సాధించేలా చేస్తూ, 24 గంటల నాణ్యమైన కరెంటు, ప్రతి ఎకరాకు సాగునీరు, ప్రతి ఇంటికి తాగునీరు, సంక్షేమ పథకాలు అందించి రాష్ర్టాన్ని అనతికాలంలోనే దేశంలో నంబర్ వన్‌గా తీర్చిదిద్దారు. బంగారు తెలంగాణ వైపు రాష్ర్టాన్ని పరుగులు పెట్టించారు. కానీ, కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలను నమ్మి అత్యాశకు పోయిన ప్రజలు ఆ పార్టీకి అధికారం అప్పగించారు.

> **ప్రజలకు ఎన్నో ఆశలు కల్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు మోచేతికి బెల్లం పెట్టి నాకమంటున్నది. సమైక్య రాష్ట్రంలో ముఖ్యమంత్రి అధికారిక నివాసం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లను ప్రమాణస్వీకారం చేయకముందే ధ్వంసం చేసిన రేవంత్‌రెడ్డి సర్కార్ రాష్ర్టాన్ని విధ్వంసం వైపు నడపడంలో మొదటి అడుగు వేసింది. తన సొంత ఇంటి నుంచి ప్రభుత్వాన్ని నడుపుతున్న రేవంత్.. నిత్యం తమకు అందుబాటులో ఉంటాడని ఆశించిన ప్రజలకు మొండి చెయ్యి చూపించారు.**

కేసీఆర్‌పై ఉన్న అక్కసుతో తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టును రేవంత్ ఎండబెట్టారు. దురదృష్టవశాత్తూ మేడిగడ్డ బరాజ్‌లోని రెండు పిల్లర్లు కుంగిపోతే లక్ష కోట్ల రూపాయల నష్టం అంటూ కాంగ్రెస్ నేతలు దుష్ప్రచారం చేశారు. కాళేశ్వరం పేరు చెప్పుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆ పిల్లర్లకు మరమ్మతులు కూడా చేయించలేదు. పర్యవసానంగా లక్షల క్యూసెక్కుల నీళ్లు సముద్రం పాలయ్యాయి. తెలంగాణ మళ్లీ కరువు కాటకాలతో అల్లలాడాలనే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విధమైన కుట్రలకు పాల్పడుతున్నది.

దేశ సంపదను ప్రదాని మోదీ ఆప్తమిత్రుడైన అదానీ కొల్లగొడుతున్నారని రాహుల్‌గాంధీ గగ్గోలు పెడుతుంటే, రేవంత్ మాత్రం అదానీకి ఎర్రతివాచీ పరుస్తున్నారు. మూసీ పరీవాహక ప్రాంతంలో అదానీ సిమెంటు పరిశ్రమ ఏర్పాటుకు ఆగమేఘాల మీద అనుమతులిచ్చిన రేవంత్ సర్కార్ నల్గొండ జిల్లాను కాలుష్య కాసారంగా మార్చేందుకు కంకణం కట్టుకున్నది. అంతేకాదు, తెలంగాణలోని బొగ్గు గనులను ప్రైవేటు కంపెనీలకు కట్టబెట్టేందుకు చూస్తున్న బీజేపీకి కాంగ్రెస్ వంతపాడుతున్నది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన వేలంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొనడమే అందుకు నిదర్శనం. ఇది ముమ్మాటికీ తెలంగాణ ధ్వంస రచనకు పునాది వేయడమే. తెలంగాణలోని బొగ్గు గనులు ప్రైవేటు చేతిలోకి వెళ్లకుండా కేసీఆర్ సర్కార్ పదేండ్ల పాటు అడ్డుకున్నది. తెలంగాణ గనులను సింగరేణికే కేటాయించాలని పోరాడింది. కానీ, ఇప్పుడు రేవంత్ సర్కార్ వాటిని అప్పనంగా కేంద్ర ప్రభుత్వానికి అప్పగించింది. దామగుండం అడవులను నేవీకి అప్పగించిన కాంగ్రెస్ ప్రభుత్వం పర్యావరణ విధ్వంసం వైపు అడుగు లేసింది. తద్వారా మూసీ జన్మస్థలాన్ని నాశనం చేసి ఆ నది గొంతు పిసికింది.

హైడ్రా కారణంగా హైదరాబాద్ అతలాకుతలమైంది. ఆర్ఆర్ ట్యాక్స్ కట్టని వారిని భయభ్రాంతులకు గురిచేసేందుకు దీన్ని తెరపైకి తీసుకొచ్చినట్టు ఆరోపణలున్నాయి. అంతేకాదు, రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. తన స్వార్థ ప్రయోజనాల కోసం విధ్వంసకాండ జరుపుతున్న కాంగ్రెస్ పాలకులను చరిత్ర ఎన్నటికీ క్షమించదు.

ఫార్మా సిటీ ఏర్పాటు కోసం కేసీఆర్ సర్కార్ 15 వేల ఎకరాలను ఎలాంటి వివాదం లేకుండా సేకరించింది. కానీ, రేవంత్ మాత్రం తన కుటుంబ సభ్యులకు లబ్ధి చేకూర్చాలని 1500 ఎకరాల కోసం గిరిజనులపై దాష్టీకానికి దిగారు. పచ్చని పంట పొలాలు లాక్కునే ప్రయత్నంలో లగచర్ల రైతులపై ప్రదర్శించిన జులుం కాంగ్రెస్ సర్కార్ చేస్తున్న జీవన విధ్వంసానికి పరాకాష్ఠ. రైతుబంధు పథకాన్ని బందుపెట్టిన రేవంత్ ప్రభుత్వం వ్యవసాయ రంగ విధ్వంసానికి పాల్పడుతున్నది. బతుకమ్మ చీరల పథకాన్ని రద్దు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో చేనేతరంగ విధ్వంసానికి పూనుకున్నది.

ప్రతి తెలంగాణ బిడ్డ చదువుకోవాలన్న గొప్ప ఆలోచనతో కేసీఆర్ ప్రారంభించిన గురుకులాలను గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం 48 మంది విద్యార్థుల చావుకు కారణమైంది. రేవంత్ ప్రభుత్వ నిర్లక్ష్యం, విద్యాశాఖ మంత్రి లేకపోవడం వల్ల విద్యావ్యవస్థ సర్వనాశనమైపోయింది. అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా హోంమంత్రిని నియమించలేదు. దీంతో తమ కష్టాలు చెప్పుకునేందుకు ఎవరూ లేక పోలీసులు రోడ్డుపైకి వచ్చి ధర్నాలు చేయాల్సి వస్తున్నది. అంతేకాదు, శాంతిభద్రతలు క్షీణించి హత్యలు, లైంగికదాడులు జరుగుతున్నాయి. ఎన్నడూ లేని విధంగా గుళ్లు, గోపురాలపై దాడులు జరుగుతున్నాయి. మైనారిటీలపైనా దాడులు జరుగుతుండటం ఆందోళనకరం.

> **రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించడం, మూసీ, హైడ్రా కూల్చివేతల పుణ్యాన హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతిన్నది. దాంతో పెట్టుబడులు నిలిచిపోయాయి. ఏడాదిలో రూ.80 వేల కోట్ల అప్పులు తెచ్చిన రేవంత్‌రెడ్డి ఒక్క కొత్త అభివృద్ధి పని చేయకపోవడం విడ్డూరం. తమ అస్మదీయ కాంట్రాక్టర్లకు బిల్లులు ఇచ్చుకుంటూ, 15 శాతం కమీషన్లు వసూలు చేస్తూ రాష్ట్ర ఆర్థికరంగాన్ని ధ్వంసం చేసింది. కమీషన్లు, వసూళ్లకు భయపడుతున్న కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులు చేసేందుకు ముందుకురావడం లేదు.**

'ఇందుగలడు అందులేడని సందేహం వలదు ఎందెందు వెతికినా అందందు గలడు' అన్న రీతిలో ప్రతి రంగాన్ని రేవంత్ సర్కార్ విధ్వంసం చేసింది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తన తీరు మార్చుకోవాలి. పూర్తిస్థాయిలో మంత్రివర్గాన్ని విస్తరించాలి. అంతేకాదు, కేసీఆర్, కేటీఆర్ ఫోబియా నుంచి బయటపడి ప్రతిపక్ష నాయకులు, వారి కుటుంబ సభ్యులను వేధించడం మానుకొని పరిపాలనపైనే పూర్తిగా దృష్టి సారించాలి. 6 గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయాలి. లేకపోతే రేవంత్ చేతిలో కాంగ్రెస్ పార్టీ నామరూపాలు లేకుండా కనుమరుగు కావడం ఖాయం.

హాస్టల్ విద్యార్థుల ఆర్తనాదాలు!

> **రాష్ట్రంలోని వసతిగృహాలు, గురుకులాలు, కేజీబీవీలలో పెడుతున్న తిండి తినలేకపోతున్నా మని విద్యార్థులు రోడ్డెక్కుతున్నారు. మాకు నాణ్యమైన భోజనం పెట్టాలని వారు ఏడుస్తూ డిమాండ్ చేస్తుండటం చూస్తుంటే గుండె తరుక్కుపోతున్నది. తరచుగా ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని విద్యాలయాల్లో కలిపి దాదాపు 48 మంది విద్యార్థులు మరణించడంబాధాకరం. ఈ ఘటనలపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం.**

తాజాగా నారాయణపేట జిల్లా మాగనూరు జడ్పీ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అయిన కారణంగా 21 మంది విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో ఈ పర్వం ఇంకా కొనసాగుతున్నదని రుజువవుతున్నది. గత నవంబర్ 6న మంచిర్యాల జిల్లాలోని సాయికుంట గిరిజన ఆశ్రమ పాఠశాలలో 12 మంది విద్యార్థినుల ఆరోగ్యం దెబ్బతిన్నది. అక్టోబర్ 30న కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 50 మందికి పైగా గిరిజన బాలికలు అస్వస్థతకు గురయ్యారు. మార్చి 8న జనగామ జిల్లా కేంద్రం సమీపంలోని పెంబర్తి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 8 మంది విద్యార్థినులు, ఆగస్టు 7న మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో 40 మంది విద్యార్థులు దవాఖాన పాలయ్యారు. ఆగస్టు 9న జగిత్యాల జిల్లా పెద్దపూర్ గురుకుల పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు అస్వస్థతకు గురికాగా, తీవ్ర కడుపు నొప్పితో 6వ తరగతి విద్యార్థి మృతిచెందడం బాధాకరం. మార్చి నుంచి నవంబర్ 15 వరకు దాదాపు 200 మంది గురుకుల, సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఏప్రిల్ 14న భువనగిరి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 27 మంది విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ కాగా, 7వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థి తీవ్ర అనారోగ్యానికి గురై మృతిచెందాడు. రాష్ట్రంలోని అన్ని గురుకుల సంక్షేమ హాస్టళ్లలో ఇలాంటి పరిస్థితులే ఉన్నాయి. దీంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందో, ఏ క్షణాన ఏ వార్త వినాల్సి వస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనలకు గురవుతున్నారు.

> **ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు రాష్ట్రవ్యాప్తంగా గురుకులాలు, ప్రభుత్వ వసతిగృహాలు, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ ఘటనల వెనుక ఉన్న నిర్లక్ష్యం అధికారులదా, లేక ప్రభుత్వానిదా అంటే కచ్చితంగా ప్రభుత్వానిదేనని చెప్పాలి. వసతి గృహాల్లో భోజనం బాగుండటం లేదని విద్యార్థులు ఎప్పటికప్పుడు నిరసనలు వ్యక్తం చేస్తూనే ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.**

ప్రస్తుత మార్కెట్ ధరలతో పోల్చితే ప్రభుత్వం చెల్లించే డబ్బులు ఏ మూలకు సరిపోవడం లేదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. దీంతో కాంట్రాక్టర్లు భోజనంలో నాణ్యతను తగ్గిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అపరిశుభ్ర వాతావరణంలో సరుకులను నిల్వచేస్తూ, కుళ్లిన కూరగాయలు, పుచ్చిపోయిన పప్పులతో వంటలు చేస్తుండటం కూడా ఒక కారణమేనని తెలుస్తున్నది. ఘటనలు జరిగినప్పుడు మినహా మంత్రులు, సంబంధిత అధికారులు వసతిగృహాలలో పర్యవేక్షణ చేయకపోవడం వల్ల నిర్వాహకులు ఇష్టారీతిన, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థులు ఏకరువు పెడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిద్రమత్తులోంచి మేల్కోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

హాస్టళ్లు, గురుకులాల్లో ఉండి చదువుకునే విద్యార్థులకు సన్నబియ్యంతో అన్నం పెడుతున్నామని రాష్ట్ర ప్రభుత్వం గొప్పలకు పోతున్నది. కానీ వాస్తవాలు అందుకు భిన్నంగా ఉంటున్నాయి. హాస్టళ్లు, గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను ప్రశ్నిస్తే.. 'మాకు దొడ్డు బువ్వనే పెడుతున్నారు' అని చెప్తున్నారు. కొన్ని నెలలుగా ఎంఎల్ఎస్ (మండల్ లెవెల్ స్టాక్) కేంద్రాల నుంచి పిట్టలు కట్టిన, పురుగు పట్టిన, ముక్కిన బియ్యాన్ని అనుమతిస్తున్నారని తెలుస్తున్నది. వీటిపై ఎన్ని ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కారణం ఏమిటా అని ఆరా తీస్తే వారికి ప్రభుత్వ పెద్దల అండదండలున్నాయని తెలుస్తున్నది. ఏం చేయాలో తెలువని విద్యార్థులు పెట్టిందే తిని తరచుగా వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురవుతూ ఆస్పత్రుల పాలవుతున్నారు. ఇన్ని జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణం. ఒకరకంగా చెప్పాలంటే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నది. ఇకనైనా ప్రభుత్వం మేల్కొని రాష్ట్రంలో ఉన్నటువంటి సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలి. హాస్టళ్ల కోసం ప్రత్యేక అధికారులను నియమించి, మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించాలి. అప్పుడే విద్యార్థులను కాపాడుకున్న వారమవుతామని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

దేవేందర్ ముంజంపల్లి
89784 58611
(వ్యాసకర్త: జర్నలిజం పరిశోధక విద్యార్థి, కేయూ)

తెరవెనుక దోపిడీ.. తెరముందు గారడీ!

ఇనుగుర్తి సత్యనారాయణ
97046 17343

దేశంలో కష్టపడే ప్రజలున్నారు. రోజురోజుకు సంపద పెరుగుతూనే ఉన్నది. కానీ, ఆ పెరిగిన సంపద కొంతమంది చేతుల్లోకి చేరిపోతున్నది. పాలకులు తమ ఆశ్రిత పెట్టుబడిదారులకు ప్రజల ఆస్తులను, ప్రకృతి సంపదను దోచిపెడుతున్నారు. పెట్టుబడిదారుల నష్టాలను సోషలైజ్ చేస్తూ, వారి లాభాలను మాత్రం ప్రైవేటైజ్ చేస్తున్నారు. అందుకు ఉదాహరణే దేశంలో పేరుమోసిన ఆశ్రిత పెట్టుబడిదారుడు గౌతమ్ అదానీ. అధికార పీఠాలపై ఆసీనులైన వాళ్ల అండదండలతో వ్యాపార సామ్రాజ్యాన్ని అదానీ విస్తరించిన తీరును చూస్తుంటే ప్రజలు కట్టబెట్టిన అధికారాన్ని పాలకులు ఎంత బహిరంగంగా హేళన చేస్తున్నారో అర్థమవుతున్నది. ప్రభుత్వ పెద్దలను మచ్చిక చేసుకోవడం, కీలక వ్యక్తులకు లంచాలు కుమ్మరించడం ప్రభుత్వాల అండదండలతో సంపద పెంచుకోవడం.. ఇదీ అదానీ వ్యాపార సూత్రం.

మన దేశంలోనే కాదు, విదేశాల్లోనూ అదానీ వ్యాపారాలపై ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. భారత ప్రధాని మోదీ ఒత్తిడి మేరకే విద్యుత్ ప్రాజెక్టును కట్టబెట్టాల్సి వచ్చిందని స్వయంగా శ్రీలంక విద్యుత్ శాఖ ప్రతినిధులు ఆ దేశ పార్లమెంట్‌లో ప్రకటించారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అయితే, ఇలా పెద్దల అండదండలతో దూసుకుపోతున్న అదానీ అమెరికాలో మాత్రం చతికిలపడ్డాడు. అమెరికాలో పెట్టుబడిదారుల నుంచి సేకరించిన డబ్బును భారత్‌లోని పలు రాష్ట్ర ప్రభుత్వాల ముఖ్యులకు లంచాలుగా ఇచ్చారని అగ్రరాజ్యం తాజాగా ఓ కేసు నమోదు చేసింది. అంతేకాదు, అరెస్టుకు వారంట్ కూడా జారీ చేసింది. దీంతో కెన్యా వెంటనే అదానీతో ఉన్న ఒప్పందాలను రద్దు చేసుకున్నది. ప్రధాన విమానాశ్రయ అభివృద్ధి, 30 ఏండ్ల నిర్వహణ కోసం రూ.15,631 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు కెన్యా ప్రభుత్వం అదానీతో గతంలో ఒప్పందం చేసుకున్నది. అలాగే పవర్ లైన్ల నిర్మాణానికి రూ.6,218 కోట్లతో అగ్రిమెంట్ కుదుర్చుకున్నది. ఎప్పుడైతే అమెరికా కేసు నమోదు చేసిందో ఆ వెంటనే ఈ రెండు ఒప్పందాలను రద్దు చేసుకున్నట్టు కెన్యా అధ్యక్షుడు రూటో తేల్చిచెప్పారు. ఇలా అంతర్జాతీయంగా అవినీతి ముద్ర వేసుకున్న అదానీని అటు భారత్‌లో, ఇటు మన తెలంగాణలో నెత్తికెత్తుకోవడానికి కారణాలేమిటో ఏలికలకే తెలియాలి.

అదానీ అరెస్టుకు అమెరికా కోర్టు వారంట్ జారీ చేయడంతో భారత్‌లో అంటకాగినవాళ్లంతా ఉలిక్కిపడ్డారు. ఇక తెలంగాణ విషయానికి వస్తే ప్రతిపాదిత స్కిల్ యూనివర్సిటీకి అదానీ ఇచ్చిన రూ.100 కోట్ల చందాను తీసుకోవడానికి సిద్ధంగా లేమంటూ సీఎం రేవంత్‌రెడ్డి వెనుకడుగు వేశారు. కానీ, అదానీతో చేసుకున్న ఒప్పందాలపై ఆయన స్పష్టత ఇవ్వలేదు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా పూణెలో పర్యటించిన రేవంత్ మోదీ, అదానీ కలిసి దోపిడీకి ప్లాన్ చేశారని, మరాఠీలు ఆదమరిస్తే ఆర్థిక రాజధాని ముంబై ఆగమైతుందని విమర్శించారు. మహారాష్ట్రలో దోపిడీ కోసం పెట్టుబడులు పెట్టే అదానీ.. రేవంత్‌రెడ్డితో చేసుకునే ఒప్పందాల ద్వారా తెలంగాణను ఉద్ధరిస్తారా అనే విషయమై ఆయనే సెలవియ్యాలి. ఇక్కడ విషయం రూ.100 కోట్ల చందాకు సంబంధించినది మాత్రమే కాదు, దావోస్‌లో అదానీ కంపెనీలతో రేవంత్‌రెడ్డి చేసుకున్న పెట్టుబడుల ఒప్పందాలు, నల్గొండ జిల్లాలో అదానీకి చెందిన అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతులపై ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. రేవంత్ పరిభాషలో చెప్పాలంటే దోపిడీదారుడైన అదానీతో ఆయన చేసుకున్న ఒప్పందాలు పారదర్శకంగా జరిగాయని ప్రజలు ఎలా నమ్మాలి?

> **అదానీ కంపెనీ నుంచి బొగ్గు కొనుగోళ్లు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్రం ఒత్తిడి చేసిన సంగతి తెలిసిందే. కానీ, ఈ ప్రతిపాదనను తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యతిరేకించారు. 'కోల్ ఇండియా మైనింగ్ కంటే సింగరేణి గొప్పగా పనిచేస్తున్నది. ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించే లక్ష్యంతో సింగరేణిని కాపాడుకుంటాం. టీఎస్‌జెన్‌కో ఆధ్వర్యంలోనే బొగ్గు ఉత్పత్తిని కొనసాగిస్తాం. దేశంలో రూ.3 వేల నుంచి రూ.4 వేలకు టన్ను బొగ్గు లభ్యమౌతున్నప్పుడు అదానీ కంపెనీకి చెందిన ఆస్ట్రేలియా బొగ్గును టన్నుకు రూ.30 వేల నుంచి 40 వేలు వెచ్చించి కొనాల్సిన అవసరం ఏమిటి? అదానీ నుంచి బొగ్గు కొనుగోలు చేయాలంటూ రాష్ట్రాలపై కేంద్రం ఒత్తిడి పెంచడంలో ఆంతర్యమేంటి?' అని 2017లోనే ఆయన ప్రశ్నించారు.**

అమెరికాలోని హిండెన్‌బర్గ్ సంస్థ 2023లోనే అదానీపై తీవ్ర ఆరోపణలు చేసింది. స్టాక్‌మార్కెట్‌లో అదానీ కంపెనీ షేర్ల విషయంలో అవకతవకలకు పాల్పడుతున్నదని నివేదికను విడుదల చేసింది. దీంతో స్టాక్ మార్కెట్‌లో అదానీ షేర్ల విలువ ఘోరంగా పతనమైంది. అదానీ వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ-జేపీసీ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా డిమాండ్ చేశారు. దేశంలో ప్రధాని మోదీ, అదానీ కలిసి దోపిడీకి పాల్పడుతున్నారని రాహుల్ ఆరోపణలు చేస్తున్నారు. కానీ, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అదానీతో వేల కోట్ల రూపాయల ఒప్పందాలు ఎలా చేసుకుంటున్నది? అయితే, దావోస్ వేదికగా అదానీ కంపెనీతో రేవంత్ చేసుకున్న రూ.12,440 కోట్ల ఒప్పందం రాహుల్‌కు తెలియకుండానే జరిగిందా? ఇదిలా ఉంటే.. రామన్నపేటలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీకి రెడ్ కార్పెట్ పర్చడం, కొడంగల్‌లో సిమెంట్ ఫ్యాక్టరీకి ప్రతిపాదనలపై రేవంత్ ప్రభుత్వ వైఖరేంటో ప్రజలకు స్పష్టతను ఇవ్వాలి.

అదానీతో రేవంత్ చేసుకున్న నేటి ఒప్పందాలు, రేపటి కుంభకోణాలనే విమర్శలు వినిపిస్తున్నాయి. తెరవెనుక దోపిడీ మంత్రాంగం నడుపుతూ తెరముందు గారడీ చేస్తున్నారంటూ రాహుల్, రేవంత్ పాలిట్రిక్స్‌ను ప్రజలు తూర్పారపడుతున్నారు. దేశంలో ప్రతిపక్ష పార్టీగా ఒక స్టాండ్, తెలంగాణలో అధికార పార్టీగా మరో స్టాండ్ తీసుకుంటూ అవినీతి ఆరోపిత అదానీకి కాంగ్రెస్ పార్టీ ఎర్ర తివాచీ పరుస్తున్నది. దీని వెనుక ఉన్న మతలబు ఏమిటో ప్రజలకు తెలువదా? దేశ సంపదను ఒకరు, రాష్ట్ర వనరులను మరొకరు పోటీపడి అవినీతి, ఆశ్రిత పెట్టుబడిదారులకు కట్టబెట్టడం భవిష్యత్ తరాలకు నష్టదాయకం.

> **టీఆర్ఎస్, బీఆర్ఎస్‌గా రూపాంతరం చెందిన తర్వాత కేసీఆర్ 2023 ఫిబ్రవరిలో నాందేడ్‌లో తొలి బహిరంగ సభ నిర్వహించారు. ఆ సభ అనంతరం నేషనల్ మీడియాతో మాట్లాడిన కేసీఆర్ బీజేపీ, అదానీ స్నేహాన్ని ఎండగట్టారు. 'అదానీ కంపెనీలో ఎల్ఐసీ రూ.80 వేల కోట్ల పెట్టుబడి పెట్టడం సరికాదు. ప్రపంచంలోనే అతిపెద్ద బీమా కంపెనీ అయిన ఎల్ఐసీ వ్యవహారంలో కేంద్రం ఎందుకు జోక్యం చేసుకుంటున్నది? అదానీ అవినీతిపై కేంద్రం జాయింట్ పార్లమెంటరీ కమిటీ-జేపీసీ ఏర్పాటు చేయాలి' అని డిమాండ్ చేశారు.**

ప్రజల జీవితాలతో చెలగాటం

ఆహార పదార్థాలు డోర్ డెలివరీ చేసినట్టు ఔషధాలు కూడా డోర్ డెలివరీ చేస్తుండటం దురదృష్టకరం. ఔషధ నియంత్రణ మండలి నియమ, నిబంధనలను ఇలాంటి ర్యాపిడ్ డెలివరీ మోడల్ అతిక్రమిస్తుంది. అంతేకాదు, ఈ విధానం వల్ల ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతుంది. కేంద్ర ప్రభుత్వాన్ని నేను ఒక్కటే కోరుతున్నా. ప్రజల జీవితాలతో చెలగాటమాడవద్దు.

- కనిమొళి, డీఎంకే ఎంపీ